# సత్యసంధుడు

రామారావూ రంగారావూ 'హరిశ్చంద్ర' టాకీ చూడబోయినారు. వాళ్ళిద్దరికీ ఒక్క క్షణం కూడా అభిప్రాయాలు కలవవనే మాట జగద్విఖ్యాతమే– కనీసం మావూళ్లో చాలా మందికి తెలుసు. ఒకడవునన్నది రెండోవాడు కాదంటాడు. ఒకడు కాదన్నది రెండోవాడు అవునంటాడు.

కనక వీళ్ళిద్దరూ టాకీ చూడబోయి తెరమీద ఇంకా క్రెడిట్ టైటిల్స్ (డైరెక్టరు వగైరాల పేర్లు) చూపించటమయినా పూర్తికాక పూర్వమే తగువులాడటం మొదలు పెట్టారు. ఎవరో వెనక కూర్చున్నవారు, 'ఊరుకోండయ్యా, మీనోళ్ళుపడా!' అని వేడుకున్నారు. అంత వినయంగా అడిగిన విన్నపం తోసివెయ్యటం మర్యాదగా వుండదని రామారావూ రంగారావూ తర్కించటం మానేశారు – ఒక్క నిమిషం వరకూ!

రామారావుకు టాకీని గురించి మంచి అభిప్రాయం ఏర్పడ్డదని తెలుసుకుని రంగారావు సందర్భానుసారంగా 'ఛా!' 'ఛీ!' 'ఎబ్బే!' అనటం మొదలు పెట్టాడు. రంగారావుకంటే రెండాకులు ఎక్కువే చదివాననుకుంటున్న రామారావు, రంగారావు వెంటనే 'భేష్!' 'అబ్బా!' 'బాగుంది!' అనటం మొదలు పెట్టాడు.

రంగారావు రామారావువంక తీవ్రంగా చూడసాగాడు. రామారావు రంగారావును మూడో కంటితో చూశాడు.

ఈ విధంగా ప్రదర్శనం చూడటం పూర్తిచేసి ఇద్దరూ బైటికి వచ్చారు.

"ఏం?" అన్నాడు రంగారావు.

"ఏం?" అన్నాడు రామారావు.

"ఇంతకన్న బోకుటాకీ ఎక్కడన్నా చూశావా?" అన్నాడు రంగారావు.

"ఓ! భేషుగా! నేను చూసిన ఇతర టాకీలన్నీ దీనికన్న బోకుగానే ఉన్నై!"

"నువు, పాపం మంచి టాకీ ఒక్కటయినా చూడనందుకు నాకు చాలా కష్టంగా ఉంది!"

"నేను చూసిన టాకీలలో కొన్ని మాత్రమే చూసిన నువు ఆ మాట అనటం చాలా హాస్యాస్పదంగా ఉంది....ఏమిటి నీకీ టాకీలో నచ్చని విషయం?" అని రామారావు రంగారావుని నిలదీసి అడిగాడు.

"విను. హరిశ్చంద్రుడి చరిత్ర ఇంతకాలం ప్రచారంలో ఉండటానికి కారణం ఏమిటి?" అన్నాడు రంగారావు.

"నువు చెప్పులే!" అన్నాడు రామారావు, ఏమి చెప్పితే తన పిలక రంగారావుకు చిక్కిపోతుందో అని.

"విను. హరిశ్చంద్రుడిలో ఒక గొప్ప నీతి వున్నది. హరిశ్చంద్రుడి కథ రాసినా, చదివినా, టాకీ తీసినా, చూచినా ఆ నీతి మొదటినించీ చివరవరకూ విదితం అవుతూ ఉండాలి."

'హరిశ్చంద్రుడు అన్ని కష్టాలు పడ్డాడంటే, ఎందుకు పడ్డాడూ? అతనికి అట్లా రాసిపెట్టిఉండి పడలేదు. విశ్వామిత్రుడు అతని సత్యసంధతను పరీక్ష చేశాడు. అతను ఎప్పుడు అబద్ధం ఆడదలచుకున్నా అతని కష్టాలు ఎండకు మంచువిచ్చినట్టు విచ్చిపొయ్యేవే! అందుకని ఒక్కొక్క ఇక్కట్టు పడుతున్నప్పుడల్లా హరిశ్చంద్రుడికి అబద్ధం ఆడి తప్పించుకునే టందుకు అవకాశం కనపరిచి అతను కష్టపడడానికే తీర్మానించుకున్నట్టు చూపించాలి. చూసేవాళ్ళకే

హరిశ్చంద్రుడు అబద్ధంజేసి సుఖపడితే బాగుండునురా అనిపించాలి. అంతేకాని హరిశ్చంద్రుడు ఏడుస్తూ కష్టాలు పడటమూ, మహా పతివ్రత చంద్రమతి కూడా అతనికి గుండెనిబ్బరం ఇవ్వకపోగా అతని స్థైర్యం కాస్తా నశించేటట్టు బావురుమని ఏడవటమూ — ఏమిటాకి ఇది? వెధవటాకీ?

'ఒకటి ఒప్పుకుంటాను. అసలుకథ రాసినవాడే తన పని తను నిర్వర్తించ లేదు సరిగా. అతణ్ణే అనుసరించారు టాకీ తీసినవారు. మన అభిప్రాయాలు అభి వృద్ధి అవుతున్నకొద్దీ అటువంటి మార్పులు చేసుకోవాలి. అంతేకాని హరిశ్చంద్రు డికి మతిలేదనీ, చంద్రమతి చాటుగా మొగుణ్ణి తిట్టేదనీ రాయటం తెలివికాదు. ఉన్నకథ ఉన్నట్టుగానైనా తియ్యకపోవటం అసలే తెలివికాదు.'

రంగారావు చెప్పింది ఉన్నంతలో సమంజసంగానే కనిపించింది. కాని రామారావు అంత సులభంగా 'దీన్' అయ్యే ఘటంకాదు.

'బాగానేవుంది కాని, హరిశ్చంద్రుడి కథతో సత్యవాక్య పరిపాలనా ప్రచారం ఎట్లా అవుతుందనుకున్నావురా, పిచ్చి నీ దుంపతెగా! నామటుకు నాకు హరిశ్చంద్రుడి కష్టాలు తలుచుకున్నప్పుడల్లా అబద్ధం చెప్పటమే బుద్ధికి లక్షణం అనిపిస్తూ ఉంటుంది.'

రంగారావు కాస్సేపు ఆలోచించి, 'కాదు! దాన్లో నీతి అదికాదు. ఒకడు ఏ వ్రతమైనా పట్టిన తరవాత దాన్ని కొనసాగించుకోవాలంటే ఎంత ధైర్యమూ కావాలో అదీ మనం తెలుసుకోవలిసింది' అన్నాడు.

'అటువంటి వెధవ నియమాలు పెట్టుకోకపోతేనేం?' అన్నాడు రామారావు.

'నీవంటి పురుగులకు అవసరమేలేదు. బలంకలవాడు పెద్ద పెద్ద బండ రాళ్ళను ఎత్తి అవతలపారేసి సంతోషిస్తూంటాడు. మనోదార్ఢ్యం కలవాడు నియ మాలు పెట్టుకుని అనేకరకాలయిన కష్టాలను ఎదుర్కొంటూ ఉంటాడు. అటువంటి నియమాలన్నిటిలోకి సత్యవ్రతం బహు కష్టమైన పని' అన్నాడు రంగారావు.

'సూర్యుణ్ణి చూచికాని భోంచేయనన్నా, శనివారం పస్తుంటానన్నా, సోమ వారంనాడు మాట్లాడనన్నా అందువల్ల ఇంకొకడికి అపకారంలేదు. హరిశ్చంద్రుడి సత్యవ్రతం అట్లాకాదే. తను కష్టాలు పడటమే కాక భార్యనూ పిల్లవాడినీ కూడా నానా ఇక్కట్టూ పెట్టాడే, దుర్మార్గుడు' అన్నాడు రామారావు.

'వెధవ్వా, నీకు తెలియగా లేందీ హరిశ్చంద్రుడికి ఆమాత్రం తట్ట లేదంటావా ఏమిటి? వాళ్ళు కష్టాలుపడటం చూసి సహించటం మాత్రం సులభమా, వస్తుతహా దుర్మార్గుడు కాని వాడికి. హరిశ్చంద్రుడు తను కష్టాలు

పడటానికి ఒప్పుకున్నా చంద్రమతీ లోహితాస్యులకోసం అబద్ధం ఆడకుండా ఉండటమే చాలా ఉత్కృష్టమైన విషయం. వాళ్ళకూడా అతనికి పరీక్ష! పైగా హరిశ్చంద్రుడికి ఒక నమ్మకం ఉండనే ఉంది. ఈశ్వరుడి ఆజ్ఞలేందే ఈగయినా చావదని!' అన్నాడు రంగారావు.

'అబ్బో! హరిశ్చంద్రుణ్ణి గురించి నీకెంత తెలుసురా!........అయినా నేనొక్కటి చెబుతున్నాను విను. హరిశ్చంద్రుడు వెధవ కనక అన్ని కష్టాలు పడ్డాడు కాని నిజంగా సత్యవ్రతాచరణం చాలా సులభసాధ్యమైన పని. కావాలంటే నేనే ఆచరించి చూపగలను! అన్నాడు రామారావు.

'నువ్వా!' రంగారావు దిశలు మారు మోగేటట్టు నవ్వాడు. నువ్వా? రోజుకు వెయ్యి అబద్ధాలాడకుండా జరగదు నీకు! నువ్వా!'

'ఒక్క రోజు కాదు, నెల రోజులు అబద్ధం ఆడను. ఏం పందెంవేస్తావు!' అన్నాడు రామారావు.

'వంద రూపాయలు!'

'వంద రూపాయలే!' అన్నాడు రామారావు. 'ఓడిపోతే ఇవ్వాలి సుమా!'

'పోనీ పాతిక రూపాయలు వేసుకో. నేను ఓడిపోవట మేమిటి?'

రామారావు నవ్వాడు. 'సరే పాతికే కాని ఓడిపోననీ. ధైర్యం ఉంటే, పాతిక ఎందుకు వేస్తావు?'

'నా దగ్గర లేని డబ్బు పందెం ఒడ్డితే ఎట్లా ఒప్పుకుంటావూ? అదొక అబద్ధం కాదూ?'

'కట్టుబట్టలతో నట్టడవులకు పొయ్యే హరిశ్చంద్రుడు నెల రోజుల్లో అంత డబ్బు ఇస్తానని చెప్పి నక్షత్రకుణ్ణి వెంటబెట్టుకు వెళ్ళలా?' అని రామారావు రంగారావును వదిలిపెట్టి వెళ్ళాడు.

ఆ రాత్రి రంగారావు కాస్త ముందు వెనకలు పరిశీలించి చూసుకుని రామారావును మళ్ళీ కదిలించకుండా ఉండటమే ఉత్తమమని అనుకున్నాడు. ఎందుకంటే రామారావు దగ్గిర హరిశ్చంద్రుణ్ణే పట్టి ఝూటాఖోరని నిరూపించే సమర్థత ఉంది. కాని రామారావు మర్నాడు కనపడి తన సత్యవ్రతం ప్రారంభించానని చెప్పాడు.

'అట్లా అయితే మనం కొన్ని షరతులూ అవీ రాసుకుని మధ్యవర్తిని పెట్టుకుందాం!' అన్నాడు రంగారావు. రామారావు సరే నన్నాడు.

ఇద్దరూ కలిసి నా దగ్గిరికి వచ్చారు. జరిగిన సంగతంతా చెప్పారు. ఏం జరిగిందో జరిగింది దీని అంతేమిటో కనుక్కోమన్నాను.

'మరేంలేదుగాని రామారావు ఈ నెల రోజుల్లోనూ ఒక్క అబద్ధమయినా ఆడలేదని నాకు రుజువెట్లాగూ?' అన్నాడు రంగారావు.

నేను రామారావుతో ఏకాంతంగా ఒక్క నిమిషం సేపు మాట్లాడి రంగారావుకు ధైర్యం చెప్పాను.

'మధ్యవర్తిగా నన్ను మీరిద్దరూ ఉంచారు కనక నేను రామారావు చేత ఘోర ప్రమాణాలు చేయించాను, అబద్ధం ఆడినట్టయితే ఆ విషయం దాచనని, నువ్విచ్చే పాతిక రూపాయలకూ ఆశపడి, ఆ ప్రమాణాలు కూడా లెక్కచెయ్యక రామారావు గడ్డి తినదలిస్తే నువ్వు చేసేదీ నేను చేసేదీ ఏమీ లేదు. ఈ నెల రోజుల్లోనూ వాడు అబద్ధం ఆడినట్టయితే రామారావంతట గామారావే చెప్పకుంటాడు అబద్ధం ఆడానని. అది కూడా దాస్తాడూ! ప్రమాణాలుండనే ఉన్నై. వాటిని కూడా తృణీకరిస్తాడూ! నీ డబ్బు ఊరికే ఇచ్చాననుకో! అర్ధంకాలా? మాట్లాడవేమిరా, రంగారావు?' అన్నాను.

అనుమానిస్తూ రామారావు వెళ్ళిపోయినాడు. రంగారావు పరధ్యానంగా చాలా సేపు కూర్చుని చివరకు, 'ఒరే, చూడు, రాజా! నేను గడిచిననెలలో ఒక్క అబద్ధం కూడా ఆడినట్టు లేదురా! మళ్ళీ మాట్లాడితే, గడిచిన రెండు నెలల్లో కూడా అబద్ధం ఆడినట్టు లేదు!.... రామారావుగాడు నా డబ్బు ఊరికే కాజేస్తాదే పుణ్యానికి!' అన్నాడు.

వాడు లోపల అనేక చావులు చస్తున్నాడని గ్రహించి, వాడికి కాస్త ధైర్యంగా ఉండగలందులకని. 'ఆ! అట్లాగే అనిపిస్తుంది. అబద్ధం ఆడుతున్నామనే ఆలోచనే లేకుండా అనేక అబద్ధాలాడుతాము. మొన్న నేనేం చేశాననుకున్నావు? ఎవరో నీ కెన్నేళ్ళని అడిగారు. అప్పటికి ఇరవై తొమ్మిది వెళ్ళి సరిగా మూడు రోజులైంది. ముప్ఫయ్యని చెప్పటానికి మనసొప్పక ఇరవైతొమ్మిదన్నాను చప్పున. అటువంటి అబద్ధాలు మరుక్షణమే మరిచిపోతాం. ఒక్కొక్కసారి అసలు గమనించనే గమనించం!' అన్నాను.

'అదే చిక్కు!' అన్నాడు రంగారావు. 'వాడుకూడా అటువంటి అబద్ధాలు తెలియకుండా ఆడి ఆడలేదని ప్రమాణం చెయ్యవచ్చును చూడూ?'

సత్యవ్రతమంటే మజా అనుకున్నావా? ఆ దీక్ష పట్టినవాడు అంత పరధ్యానంగా ఉండరాదు...అసలెందుకు భయపడతావురా, రాంగారావు? మొదటినించీ ఎంతో అభ్యాసం ఉండాలి నిజమే చెప్పటానికి. లేకపోతే చప్పున నోరు జారి అబద్ధం వచ్చేస్తుంది.'

'అట్లా వచ్చేసిన తరవాత మళ్ళీ తప్పు దిద్దుకుని నిజం చెప్పతాడనుకో. అప్పుడు సత్యవ్రతం భంగం అవుతుందా?' అన్నాడు రంగారావు.

'కాదనుకుంటాను!' అన్నాను రంగారావుకు ధైర్యం ఇవ్వలేక పోయి నందుకు చింతిస్తూ.

'అట్లా అయితే రామారావు నోరు జారి చిన్న విషయాల్లో అబద్ధాలాడినా మళ్ళీ దిద్దుకుంటాడు' అని రంగారావు నిస్పృహ చెందటం మొదలుపెట్టాడు.

'చిన్న విషయాల్లో బాగానే ఉంది. పెద్ద విషయాల్లో? ఒక్కొక్కసారి నిజం చెప్పటానికి వీలే ఉండదే!' అన్నాను.

'అటువంటివి సంవత్సరానికి ఒకటి కూడా జరుగుతయ్యో జరగవో!' అన్నాడు రంగారావు చిరాకుతో.

నేను ఆలోచించాను.

'అన్నట్టు నువ్వన్నది నిజమేరా, రంగారావు! రామారావు తనంతటతను అబద్ధం ఆడకపోవచ్చును. మనం వాడిచేత అబద్ధం ఆడింతాం! వాణ్ణి పరీక్ష పెట్టితే గాని వాడి సత్యసంధత రుజువు కాదు. విశ్వామిత్రుడు పరీక్ష పెట్టకపోతే హరిశ్చంద్రు డెవరో!'

రంగారావు అమాంతం కుర్చీలోనించి ఒక్క ఎగురు ఎగిరి నన్ను కౌగిలించుకుని, 'నువ్వు దేవుడల్లే దొరికావురా, రాజా! చెప్పు రామాయిని ఎట్లా పరీక్ష చెయ్యాలో!' అన్నాడు.

నేను కాస్త ఆలోచించాను. నాకూ ఏమీ పాలుబోలేదు.

'అది కొంచెం కష్టమైన విషయమే! ఎందుచేతనంటే, నువ్వు వాణ్ణి ఏను గెత్తు ధనం ఇయ్యమంటే తన దగ్గిర లేదంటాడు. నిజమేను మరీ? వాడి దగ్గిర అంత డబ్బుండదు. పోనీ ఏ వందో అడిగితే ఇవ్వనంటాడు. అది అబద్ధం ఎట్లా అవుతుంది? ఆ తరువాత నువ్వు ఇద్దరు మాల కన్నెల్ని వాడి దగ్గిరికి పంపిస్తే వాడు నీ ఆజ్ఞ అవసరం లేకుండానే వాళ్ళిద్దర్నీ పెళ్ళి చేసుకునేసును! వాడంతట వాడు కూడానూ! అటుమీదట నువ్వు వాణ్ణి రాజ్యం అడిగితే ఆట్టే ప్రయోజనం లేదూ! నీ దగ్గిర నక్షత్రకుడూ లేడూ, రామారావును పంపేటందుకు అడివీ లేదూ, వాడి వెంట పంపేటందుకు పెండ్లామూ లేదు, పిల్లవాడు మొదలే లేడూ! ఛత్! హరిశ్చంద్రుడి కథ మనకిప్పుడు ఎందుకూ పనికిరాకుండా ఉంది!' అని దీర్ఘాలోచనలో పడ్డాను.

రంగారావు మళ్ళీ వెధవ మొహం వేసి 'ఇది కుదరదని నేను అప్పుడే అనుకున్నాను. హరిశ్చంద్రుడు కష్టాలు పడ్డాడంటే, వాడి దాతృత్వం, ఏక పత్నీవ్రతం, గురుభక్తి, ఇవన్నీ హరిశ్చంద్రుడి సత్యవ్రతానికి పెద్ద ఆటంకా లయినై. అటువంటి సద్గుణాలు ఆధారంచేసుకుని విశ్వామిత్రుడు పనికానిచ్చాడు.

రామారావుగాడి కేముందీ? వాడికి నిజం చెప్పటం మంచిదనిళ్ళ ప్రాయం' అన్నాడు.

'ఇంకేంరా, పిచ్చి కుంకా! నువ్వు రామారావుగాడి దుర్గుణాలు ఆధారం చేసుకుని పరీక్ష చెయ్యి! తీరిపోలా?' అన్నాను.

'అదెట్లా?' అన్నాడు రంగారావు లేచి కూచుని.

'రామారావుగాడి దిన చర్య చూడు. వాడు ప్రతి రోజూ అనేక అనుమానాస్పదమైన వ్యాపారాల్లో వేలు పెడుతూ వుంటాడు.'

'పెడితే?'

'నీకు అందిస్తే అల్లుకుపోవటం చాతకాదేం? వాడి దిన చర్యను గురించి మరొకడితో నిజం చెప్పటానికి ఉందా?'

'లేదు, నిజమే. కాని వాడికి సిగ్గూ బిడియమూ లేవే. మనవాణ్ణి ఎక్కడికి వెళ్ళావని అడిగితే దొమ్మరసానింటికి అని ఫెడీమని జవాబు చెబుతాడు. వాడు అందు విషయమై అబద్ధం ఆడేటట్టు చెయ్యటం ఎట్లా?'

'నీతోనూ నాతోనూ నిజం చెబితే సరా? వాడికి కూడు వండిపెట్టే ముత్తవ తల్లితో కూడా అబద్ధమే చెబుతాడా నిజం చెబుతాడా?'

'బేష్! బాగుంది. అయితే మనం ఏం చెయ్యాలీ?'

'మనంకాదు. నే నిందులో వేలుపెట్టను. నేను మధ్యవర్తిని. నీ వైపు పక్షపాతంగా పనిచేసినట్టు పైకి కనిపించటం భావ్యంకాదు. నువ్వే వాణ్ణి వెంబడించి చూడు, వాడు ఎక్కడెక్కడికి వెళ్ళుతాడో, అదంతా గమనించు. తరవాత వాడి ముత్తవతల్లి దగ్గిరికి వెళ్ళి, రామారావు ఎక్కడెక్కడికి వెళ్ళాడో ఆవిణ్ణి అడగమను. తెలిలా?'

'చాలా బాగుంది! నన్ను వంటరిగా వెళ్ళమంటావా? నేను వెంబడించటం వాడు కనిపెట్టితే?'

'బాగుందే? ఏం కనిపెట్టితే? రహస్యమా? వాడివెంట ఉండివాడు నిజం ఆడుతున్నదీ అబద్ధం ఆడుతున్నదీ కనిపెట్టటానికి నీకు బోలెడంత అధికారం ఉంది.'

రంగారావు తృప్తిపడి వెళ్ళిపోయినాడు. ఏం జరుగుతుందో చూడాలని నేను చాలా ఆదుర్దాగా ఉన్నాను. మర్నాడు మధ్యాహ్నం వాడు మాయింటికి వచ్చాడు. వాడి మొహాన విజయలక్ష్మి తాండవిస్తూ ఉండకపోవటం గమనించాను.

'ఏంరా? ఏం జరిగింది?' అన్నాను.

'నీ సలహా నీ మొహమ్మల్లోనే ఉంది. నిన్న సాయంకాలం మూడుగంటల నించీ ఆరుగంటలదాకా వాణ్ణి విడవలేదు. ఆరుగంటలకు వాడు క్లబ్బు వదిలి

ఎటో ప్రయాణమైనాడు. నేను వెంట ఉండటంచూసి వాడు నన్ను రావద్దన్నాడు. నేను ఉండి తీరాలన్నాను. నాకు అధికారం ఉందన్నాను. వాడు గౌరవంగానే నాకు గల అధికారాలన్నీ చలాయించవద్దన్నాడు. తనకూ అధికారాలున్న య్యన్నాడు. అవన్నీ ఉపయోగిస్తే నే నేమవుతానో ఆలోచించమన్నాడు. నేను విశ్వామిత్రుడి సంగతి వాడితో చెప్పాను. అయితే విశ్వామిత్రుడల్లే పెద్దమనిషి తరహాగా అదృశ్యరూపంతో తన వెంట ఉండమన్నాడు. దృశ్యరూపంతో ఉంటే ఏమన్నాను. వాడు వెంటనే పక్కన ఉన్న పోలీసును పిలిచి నేను తనను మూడు గంటలనించీ వెంబడిస్తున్నాననీ పొమ్మంటే పోవటం లేదనీ చెప్పాడు. పోలీసు నన్ను నిలబెట్టి నా పేరూ చిరునామా అడిగి కనుక్కొని నాకు పావుగంటసేపు నీతి బోధచేసి యింటికి పొమ్మని సలహా ఇచ్చాడు. ఈలోపల రామారావు ఎటో మాయమైనాడు.

'నాకు భలే కోపం వచ్చింది. నేను వెంటనే వాళ్ళింటికి వెళ్ళాను. ముసలమ్మ వంట ప్రయత్నంలో ఉంది. రామారావేడని అడిగాను. తనకు తెలియదని చెప్పింది. వాడు రాగానే ఎక్కడికి వెళ్ళాడో అడగమని చెప్పి నాదారిన నేనింటికి వచ్చేశాను.

'రాత్రి వాడు రాగానే ఆవిడ ఎక్కడికి వెళ్ళావురా, నాయనా, అని అడిగిందట. వాడు దేనికన్నాడుట. ఆ పిచ్చిముండ నేనడగమన్నానని చెప్పిందిట. వాడు, అంతేకద! అన్నాడుట. సరిపోయింది.

'ఇవాళ ఉదయం నేను వాళ్ళింటికి వెళ్ళి వాడితో ఏం జరిగిందన్నాను. జరిగింది చెప్పాడు. నాకు మరీ మండిపోయింది. అందుకని ఆవిడ వింటుండగా వాణ్ణి నేనే అడిగాను. కిందటిరాత్రి ఆరుగంటల తరవాత ఎక్కడెక్కడ తిరిగావని.

'వాడు తనకు జ్ఞాపకం ఉన్నంతవరకూ ఒక జూదం కొంపకూ, ఆ తరవాత రైల్వే రెఫ్రెష్‌మెంటు రూముకూ, తదుపరి దొమ్మరసాని ఇంటికీ వెళ్ళానన్నాడు.

'హారి పీడ దుంపతెగా! చెప్పేశాడూ? అంటే ముసలమ్మ ఏమన్నది?' అన్నాను ఆశ్చర్యంతో.

రంగారావు నావంక కొరకొరా చూస్తూ, 'ఏమన్నదా?' కళ్ళవెంట నీళ్ళు వచ్చేదాకా నవ్వింది!'

'ఎందుకూ?'

'ఎందుకేమిటి? మనమడి హాస్యధోరణికి?'

మంచి అస్త్రం ఉపయోగిస్తే ఇట్టే టువ్వున తేలిపోయింది.

'ఇంకా ఏమి ఉపాయాలు చెబుతావు?' అన్నాడు రంగారావు నన్ను ఎగతాళిగా. వాడికి నాలో నమ్మకం పోయింది!

వాడిదగ్గిర నా ఆత్మగౌరవం నిలబెట్టటానికయినా నేను ఈ వియంలో పాలు తీసుకోవలసి వచ్చింది.

'తొందరపడకురా, రంగారావు. ఈ విషయం నాకు వదిలిపెట్టు!' అన్నాను గంభీరంగా.

కాని నేను చెయ్యగలిగిందేముందీ? ఎంత ఆలోచించినా రామారావుచేత అబద్ధం ఆడించడానికి ఏం చెయ్యాలో పాలు పోలేదు. వెనుకటిది సత్యకాలమనీ, ఇది అసత్యకాలమనీ జనానికి అభిప్రాయం ఎట్లాపడ్డదా అని నేను ఆశ్చర్య పడ్డాను. ఈరోజుల్లో అబద్ధం ఆడవలిసిన అగత్యం ఏమిటి? చేసేవనికి ఎవడూ సిగ్గుపడడు! ఇక అబద్ధం ఆడవలిసిన అవసరం ఎట్లా కలుగుతుంది? లోతుకు వెళ్ళిచూస్తే మన నమ్మకాలన్నీ తల్లకిందులుగానే ఉన్నట్టు కనపడతై!

కాని నేను నిస్పృహ చెందలేదు. ఒకటి గమనించాను. మనిషిని ఎంత వాగిస్తే అంత అవకాశం కలుగుతుంది అబద్ధాలాడటానికి. నోరు విప్పనివాడు అబద్ధం ఎట్లాగూ ఆడలేడు చూడండి!

అందుకని నేను రామారావుతో తరుచు తిరుగుతూ వాణ్ణి తెగవాగించటం మొదలుపెట్టాను. అయితే నేను చేసిన తెలివిగల పనేమిటంటే వాడితో మంచిగా నా వుద్దేశం చెప్పేశాను. వాడికి కోపం రాలేదు. పైగా వాడు తనచేత ఎట్లా అబద్ధం ఆడించటానికి అవకాశాలున్నవో సూచించాడు కూడానూ. వాడంత పెద్దమనిషి తరహాగా ప్రవర్తించుతాడని నేను అనుకోలేదు.

'నేను రెండుమూడు రకాలుగా అబద్ధం ఆడటానికి అవకాశం వుంది. ఒకటి మరుపువల్ల; ఎల్లాగంటే, నేను ఫలాని సమయానికి ఒక పని చేస్తానని ఆ సమయానికి అది మరచిపోవచ్చును. లేదా నువ్వొకటి చెపితే నాకు నీ మాటలు సరిగా జ్ఞాపకంలేక నీమాటలు కొన్ని మరిచిపోయి మరికొన్ని కల్పించి చెప్ప వచ్చును. రెండవది అసమర్థత. నేను చిన్నచిన్న వాగ్దానాలు చేసి అవి చెల్లించ టానికి అసమర్థుణ్ణి కావచ్చును. మూడు నా జ్ఞానేంద్రియాల లోపంవల్ల నాకు దూరానవున్న పురుషులు స్త్రీగా కనిపించవచ్చును. ఒకమాట చెపితే మరొకటిగా వినపడవచ్చును, ఒకరంగు భ్రమచేత మరొకటిగా కనిపించవచ్చును. ఇవన్నీ కాక నాకు భాష సరిగా తెలియకపోవటంచేత ఒక వస్తువుకు మరొక వస్తువు పేరు ఆపాదించవచ్చును.'

'బాగుంది, ఇటువంటి అబద్ధాలు ఆడినప్పుడు నువు ఓడినట్టు ఒప్పుకుంటావా?' అన్నాను లోపల చాలా సంతోషిస్తూ.

'ఒప్పుకోను! అదే చెప్పవస్తున్నాను. సత్య హరిశ్చంద్రుడికి కూడా ఇవి తప్పవు. ఎట్లా తప్పుతవో నువే ఆలోచించి చెప్పు.'

ముందుకాళ్ళకు చక్కగా బంధాలు వేశాడని గ్రహించుకుని నేను వెధవ మొహం వేశాను.

'కనక, పిచ్చితండ్రీ! ఈ నెలరోజుల్లో నిజమే చెప్పే బాధ్యతా, అబద్ధం ఆడితే ఓడిపోయినట్టు ఒప్పుకునే బాధ్యతా నామీదే వదిలిపెట్టండి.' అన్నాడు. నేను తలవంచుకుని చక్కా వచ్చాను.

రోజులు గడుస్తున్నై. నా కేమీ పాలుపోలేదు. రంగారావు నాతో ఈ విషయం హెచ్చరించాడు నేను వ్యవహారం మన చేతులు దాటిపోయింది. మనం చేసేదేమీలేదు; దేవుడే వాడిచేత అబద్ధం ఆడించాలని చెప్పేశాను.

రంగారావు లబలబలాడటం మొదలుపెట్టాడు.

'అట్లా కాదురా, రాజా! నామాట విను మనం వాడిచేత అబద్ధం ఆడించాలి, లేకపోతే వాడు కాస్త జాగర్త పడ్డాడంటే సంవత్సరానికి ఒక్కసారికూడా అబద్ధం ఆడవలిసిరాదు.'

'వెధవ పాతిక రూపాయల కోసరం నువ్విట్లా ఏడుస్తా వనుకోలేదు.' అని నేను వాణ్ణి తిట్టాను, నా పరువు కాపాడుకోటానికి.

రంగారావు నన్ను వదల్లేదు. ఏదో చేస్తేనే తప్ప నాకు నిద్రాహారాలుండవని నేను గ్రహించి ఆలోచించటం మొదలుపెట్టాను.

తీరా నెల అయిపోతుండగా మాంచి నాగాస్త్రంవంటి వుపాయం తట్టింది. దాంతో రామారావు పడవలిసిందే కాని గత్యంతరంలేదు.

'ఏమిటది?' అన్నాడు రంగారావు.

'మనిద్దరమూ వాణ్ణి ఒక ఛండాలమైన ప్రశ్నవేతాం. వాడు దానికి సమాధానం చెప్పగలిగి కూడా చెప్పటం ఇష్టంలేక దాస్తాడు. కొంత చెప్పినా కొంత దాస్తాడు. ఎంత విడిచేసినవాడయినా అంతా చెప్పటం అసంభవం!

'ఇవాళ వాడు మనకు దొరకడుగాని రేపు వాణ్ణి ఇక్కడికి తీసుకురా!' రంగారావు 'ఏమిటా ప్రశ్న' అని అడిగాడు.

'చెపుతానులే రామారావును తీసుకుర'మ్మన్నాను.

'రేపు గడువు ఆఖరురోజు! నీ ప్రశ్నకూడా పారకపోతే?'

'పారుతుంది. ముందు వాణ్ణి అడుగుతానుగా, ఒక విషయం అడుగుతాను

చెబుతావా అని. వాడు సరేనన్నమీదటనే ప్రశ్న వేస్తాను. లేకపోతే ఏమవుతుందంటే వాడు తీరా ప్రశ్న అడిగిన తరవాత నేను చెప్పనంటాడు, అది అబద్ధం కాదుగా!'

'ఏమిటా ప్రశ్న?'

నేను రంగారావు చెవిలో చెప్పాను. వాడి మొహం వికసించింది.

'ఇంత వెధవ ప్రశ్న అడగబోతామని వాడికి ఏ మాత్రమూ ఆచోకీ తెలియగూడదు!'

రంగారావుకు ఆ రాత్రి నిద్రకూడా పట్టలేదు. మర్నాడు ఉదయమే నా దగ్గిరికి వచ్చాడు. ఇద్దరమూ కలిసి రామారావుకోసరం బయలుదేరాం. వాణ్ణి కాఫీహోటలుకు తీసుకునివెళ్ళి అక్కడ నలుగురిలోనూ మా అస్త్రం ప్రయోగింతామని! లేకపోతే దుర్మార్గుడు మాతో సిగ్గూ శరమూ లేకుండా సమాధానం చెప్పవచ్చును. నలుగురిలోనూ ఎట్లా చెప్పగలడూ?

నేనూ రంగారావూ రామారావును పేరుపెట్టి పిలిచాం. కొంతసేపు ఎవరూ పలకలేదు. చివరకు ముసలమ్మ బయటికి వచ్చింది.

'ఏమండీ, రామారావు నిద్రలేచాడా?' అన్నాము.

'వాడు రాత్రిబండికి ఊరికి పోయినాడు, నాయనా. మళ్ళీ రేపు సాయంతరం వస్తాడు!' అని చావుకబురు చల్లగా చెప్పింది.

[ముద్రణ : మే 1946 వర్ప్రసాదం (కథలు)
రెండవ ముద్రణ : యువ బుక్ డిపో, మద్రాసు]